సాక్షి ప్రకాశం

శుక్రవారం । 11 । ఆగస్టు । 2023



కారును ఢీకొట్టిన లారీ

కారును లారీ ఢీకొట్టి ఒకరు మృతిచెందగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఒంగోలు–కర్నూలు రోడ్డుపై చీమకుర్తి–సంతనూతలపాడు మధ్య ఈ ప్రమాదం జరిగింది. - 8లో..



అవినీతికి పాల్పడితే సహించేది లేదు

పోలీస్ అధికారులు అవినీతికి పాల్పడితే సహించేది లేదని ఎస్పీ మలికాగర్గ్ హెచ్చరించారు. - 8లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39/29

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వర్షం కురిసే అవకాశం ఉంది. చల్లని గాలులు వీస్తాయి.

గృహ సంకల్పం

జిల్లాలోని నిరుపేద అక్కచెల్లెమ్మల సొంతింటి కలలు నెరవేరుతున్నాయి. నవరత్నాలు..పేదలందరికీ ఇళ్ల పథకం కింద వైఎస్సార్ జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించడంతో పనులు జోరందుకున్నాయి. జిల్లాకు 66,325 గృహాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, అందులో 73 శాతం ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తయి నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికే 17,337 వేల ఇళ్లు పూర్తయ్యాయి. టీడీపీ పలు ప్రాంతాల్లో న్యాయపరమైన అడ్డంకులు సృష్టించినా వాటిని ఎదుర్కొంటూనే రాష్ట్ర ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తోంది.

- శరవేగంగా ఇళ్ల నిర్మాణాలు
- జిల్లాలో లే అవుట్ల సంఖ్య 619
- మంజూరైన గృహాలు 66,325
- 48,955 ఇళ్లకు గ్రౌండింగ్
- ఇప్పటి వరకూ 17,337 నిర్మాణాలు పూర్తి
- పూర్తయిన వాటిలో 14 వేల ఇళ్లకు విద్యుత్, నీటి సరఫరా



గిద్దలూరులోని జగనన్న లే అవుట్‌లో నిర్మాణంలో ఉన్న గృహాలు

ఒంగోలు అర్బన్:

రాష్ట్ర ప్రభుత్వం పేదలకు ఇచ్చిన ఇంటి స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. స్థలాల కేటాయింపుల దగ్గర నుంచి నిర్మాణాల వరకూ టీడీపీ అడ్డంకులు సృష్టిస్తూనే ఉంది. పేదలకు ఎలాగైనా గృహాలు నిర్మించాలన్న పట్టుదలతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అడుగులు వేస్తున్నారు. గృహ నిర్మాణాలపై నిరంతరం కలెక్టర్లతో వీడియో సమావేశాలు నిర్వహిస్తూ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. పేదలకు గూడు కల్పించాలనే ఉద్దేశంతో జగనన్న లే అవుట్లు ఏర్పాటు చేసి ఊర్లకు ఊర్లనే నిర్మించేలా లే అవుట్లు వేసి వాటిలో గృహ నిర్మాణాలు చేపట్టారు.

జిల్లాకు 66,325 ఇళ్లు...

జిల్లాకు 66,325 ఇళ్లు మంజూరయ్యాయి. వాటిలో జగనన్న లే అవుట్లలో రాష్ట్ర ప్రభుత్వం స్థలం ఇచ్చిన 45,555 మందికి ఇళ్లు మంజూరు చేయగా సొంత స్థలాలు ఉండి ఇళ్లు కట్టుకోలేని 20,770 మందికి ఇళ్లు మంజూరు చేశారు. మంజూరైన మొత్తం ఇళ్లలో 48,955 ఇళ్లకు గ్రౌండింగ్ పూర్తయింది. అందులో కొన్ని పూర్తయ్యే దశలో ఉండగా, మరికొన్ని శ్లాబ్, లింటల్ వంటి వివిధ దశల్లో ఉన్నాయి. ఇళ్ల నిర్మాణాలతో పేదలకు సొంత ఆస్తి ఏర్పడటంతో పాటు ఎంతోమంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనుము కొరత లేకుండా కలెక్టర్ దినేష్‌కుమార్ ముందస్తు ప్రణాళికలతో యంత్రాంగానికి దిశా నిర్దేశం చేస్తూ నిర్మాణాలు వేగవంతం చేశారు. తొలి దశగా రాష్ట్ర వ్యాప్తంగా 5 లక్షల ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకోగా, అందులో జిల్లాకు 18,115 ఇళ్లకు అనుమతులిచ్చారు. జిల్లాకు కేటాయించిన లక్ష్యంలో ఇప్పటికే 17,337 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన 778 ఇళ్లు దాదాపుగా చివరి దశల్లో ఉన్నాయి. వాటిని ఆగస్టు నెలాఖరుకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకూ పూర్తయిన ఇళ్లలో 14,754 ఇళ్లకు విద్యుత్, 14,339 ఇళ్లకు నీటి సరఫరా సౌకర్యాలు సైతం కల్పించారు.

జిల్లా కేంద్రంలో పట్టువీడకుండా...

జిల్లా కేంద్రంలో పేదలందరికీ ఒకే ప్రాంతంలో 24 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సంకల్పించారు. రాష్ట్రంలోనే అతి పెద్ద వెంచర్‌ను యరజర్ల ప్రాంతంలో 800 ఎకరాల్లో ఏర్పాటు చేసి ప్లాట్లు వేసి ఒక పట్టణాన్ని నిర్మించేందుకు సిద్ధమయ్యారు. ఇది పూర్తయితే బాలినేనికి మంచి పేరు వస్తుందని భయపడిన టీడీపీ నేత దామచర్ల జనార్దన్ తన అనుచరులతో కోర్టులో కేసు వేయించి పట్టాల పంపిణీని అడ్డుకున్న విషయం తెలిసిందే. అయితే పట్టువదలని బాలినేని అర్హులైన పేదలందరికీ ఇళ్ల పట్టాలు అందజేసి ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వంతో చర్చించి ప్రైవేటు భూములు కొనుగోలు చేసి పేదలకు పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఆ మేరకు జిల్లా కలెక్టర్‌తో నిరంతరం చర్చిస్తూ పేదలకు పట్టాలు పంపిణీ చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్నారు. నగర పరిసరాల్లో 500 ఎకరాల భూమిని సైతం సేకరించారు.

అర్హులైన పేదలందరికీ ఇళ్లు



ప్రభుత్వం సంకల్పించినట్లు అర్హులైన పేదలందరికీ ఇళ్లు అందజేస్తాం. స్థలాలు లేని వారికి స్థలాలు అందజేసి గృహాలు నిర్మిస్తాం. జిల్లాకు కేటాయించిన లక్ష్యాన్ని దాదాపుగా చేరుకున్నాం. ఈ నెలాఖరుకు లక్ష్యం పూర్తి చేస్తాం. జగనన్న లే అవుట్లలో నిర్మాణాలను వేగంగా పూర్తిచేసేలా పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకున్నాం. జిల్లాలో గ్రౌండింగ్ పూర్తయినవి వేగంగా పూర్తి చేసేలా చూస్తాం. సచివాలయ సిబ్బందితో పాటు ఎంపీడీఓలు, తహసీల్దార్లు ఇళ్ల నిర్మాణాలను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి వారం నిర్మాణాల పురోగతిని పరిశీలిస్తూ యంత్రాంగానికి తగిన సూచనలు చేస్తూ వేగవంతం చేశాం. నిర్మాణాలు ప్రారంభం కానివి ఎందుకు కాలేదని కారణాలను తెలుసుకుంటున్నాం. వాటిని త్వరలో ప్రారంభించి నిర్మాణాలు చేపడతాం. నిర్మాణాలకు అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనుముకు ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకున్నాం.

– ఏఎస్ దినేష్‌కుమార్, కలెక్టర్

నేడు ఎమ్మెల్యే బాలినేని రాక



ఒంగోలు: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం ఒంగోలు రానున్నట్లు వైఎస్సార్ సీపీ నగర నాయకుడు కటారి శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు సింహపురి ఎక్స్‌ప్రెస్‌లో ఒంగోలు చేరుకుంటారని చెప్పారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, కన్వీనర్లు, గృహ సారథులు, అభిమానులు బాలినేనికి స్వాగతం పలికేందుకు రైల్వేస్టేషన్‌కు వద్దకు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

ముగిసిన పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

- రెండు సర్పంచ్ స్థానాలకు 17 నామినేషన్లు
- 63 వార్డు సభ్యుల స్థానాలకు 132 నామినేషన్లు

ఒంగోలు అర్బన్: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో ఏర్పడిన ఖాళీలకు సంబంధించి సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు నిర్వహించేందుకు నిర్వహించిన నామినేషన్ల ప్రక్రియ గురువారంతో ముగిసింది. గడువు ముగిసే సమయానికి జిల్లాలో రెండు సర్పంచ్ స్థానాలైన శింగరాయకొండ, అర్ధవీడుకు మొత్తం 17 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో అర్ధవీడుకు 4, శింగరాయకొండకు 13 నామినేషన్లు వచ్చాయి. అదేవిధంగా వివిధ పంచాయతీల్లో ఖాళీగా ఉన్న 63 వార్డులకు సంబంధించి మొత్తం 132 నామినేషన్లు దాఖలయ్యాయి. వాటిలో 21 వార్డులకు ఒక్కొక్కటి చొప్పున నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ నెల 11వ తేదీ నామినేషన్ల పరిశీలన ప్రక్రియ నిర్వహిస్తారు. 12వ తేదీ అభ్యంతరాల స్వీకరణ, 14న నామినేషన్ల ఉపసంహరణ నిర్వహించి అదేరోజు పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. ఈ నెల 19వ తేదీ పోలింగ్ నిర్వహించి అదేరోజు కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

న్యూస్‌రీల్

ఓటర్ల జాబితా సర్వేలో ప్రకాశం ఫస్ట్

- కలెక్టర్‌ను అభినందించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, జేసీ

ఒంగోలు అర్బన్: పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపొందించేందుకు బీఎల్‌ఓలతో చేపట్టిన ఇంటింటి సర్వేలో ప్రకాశం జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. ఆ మేరకు కలెక్టర్ దినేష్‌కుమార్‌ను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) ముఖేష్ కుమార్ మీనా అభినందించారు. గురువారం అమరావతి నుంచి కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఈఓ మాట్లాడారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు, డీఆర్‌ఓ శ్రీలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ.. మరో పది రోజుల్లో మిగిలిన సర్వే పూర్తి చేయాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు.

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలు

కొమరోలు: మండలంలోని సూరవారిపల్లెలో కొండు పీర్ల పండుగ సందర్భంగా ఈ నెల 11, 12 తేదీల్లో రాష్ట్రస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 11వ తేదీ 4 పండ్ల సైజు విభాగంలో పోటీలు జరుగుతాయని, గెలుపొందిన మొదటి ఆరుగురికి నగదు బహుమతులుగా వరుసగా రూ.25 వేలు, రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు, రూ.4 వేల చొప్పున అందిస్తామని వివరించారు. 12వ తేదీ సీనియర్ కేటగిరీ విభాగంలో బండలాగుడు పోటీలు నిర్వహిస్తామని, విజేతలకు వరుసగా రూ.60 వేలు, రూ.40 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు, రూ.6 వేలు నగదు బహుమతులుగా అందిస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు 99120 13161, 96404 01169 నంబర్లను సంప్రదించాలని కోరారు.

సెకండ్ ఫేజ్ డైట్ ప్రవేశానికి దరఖాస్తులు

చీమకుర్తి: డైట్ కాలేజీలలో సెకండ్ ఫేజ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మైనంపాడు ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్‌లో 40 శాతం మార్కులు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దాంతో పాటు ఇప్పటికే ప్రవేశం పొందిన విద్యార్థులు కోర్సు మీడియం మార్చుకునేందుకు కూడా అవకాశం కల్పించినట్లు తెలిపారు. అర్హత కలిగిన ఒరిజినల్ సర్టిఫికెట్లు ఒక సెట్, జెరాక్స్ రెండు సెట్లు తీసుకుని హాజరుకావాలని ప్రిన్సిపాల్ కోరారు.

పీఎం స్వానిధి రుణాలు రెన్యువల్ చేయాలి



పీడీసీసీబీ చైర్మన్ ప్రసాదరెడ్డిని సన్మానిస్తున్న పలు రాష్ట్ర కార్పొరేషన్ల డైరెక్టర్లు

ఒంగోలు సబర్బన్: ప్రధాన మంత్రి స్వానిధి రుణాలు సక్రమంగా చెల్లించిన వారికి తిరిగి రెన్యువల్ చేయాలని పీడీసీసీబీ మేనేజర్లకు చైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి సూచించారు. స్థానిక పీడీసీసీబీ కేంద్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరెక్టర్ మారెళ్ల శ్రీదేవీ శ్రీనివాసరావు, సూర్య బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, మైనార్టీ కార్పొరేషన్ డైరెక్టర్ మహబూబ్‌బాషా, ఏపీఐఐసీ డైరెక్టర్ ముప్పా స్వాతి విశ్వనాథ్‌లు నూతనంగా పీడీసీసీబీ చైర్మన్ బాధ్యతలు చేపట్టిన ప్రసాద్‌రెడ్డిని సన్మానించి అభినందించారు. ప్రధాన మంత్రి స్వానిధి రుణాలు రెన్యువల్ చేయించాలని రాష్ట్ర డైరెక్టర్లు విజ్ఞప్తి చేశారు. వీవీపీ రోడ్డులోని పీడీసీసీబీలో సక్రమంగా వాయిదాలు చెల్లించిన వారికి కూడా రెన్యువల్ చేయడం లేదని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. చైర్మన్ ప్రసాదరెడ్డి స్పందించి ఆ బ్యాంకు మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

రేపు హ్యాండ్‌బాల్ జిల్లా పురుషుల జట్టు ఎంపిక

ఒంగోలు: హ్యాండ్‌బాల్ ప్రకాశం జిల్లా సీనియర్ పురుషుల జట్టును ఈ నెల 12వ తేదీ స్థానిక మినీ స్టేడియంలో ఎంపిక చేయనున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి జె.నారాయణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ ఎంపికకు హాజరుకాదలచుకున్న వారు ఆధార్ కార్డుతో రావాలని సూచించారు.

కనిగిరి ప్రభుత్వాస్పత్రికి పూర్వ వైభవం

- త్వరలో వంద పడకలతో జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్
- ఆపరేషన్ పరికరాల కొనుగోలుకు నిధులు
- వైద్యశాల అభివృద్ధి కమిటీ సమావేశంలో కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: పేదలు దేవాలయంగా భావించే ప్రభుత్వ వైద్యశాలలో మెరుగైన సేవలందించి వారికి పునర్జన్మ ప్రసాదించాలని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ వైద్యసిబ్బందిని ఆదేశించారు. కనిగిరి ప్రభుత్వ వైద్యశాలలో గురువారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశానికి మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అధ్యక్షత వహించగా, ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు పూర్వ వైభవం తీసుకొస్తానన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కనిగిరి ప్రభుత్వాస్పత్రిలో వైద్యుల పోస్టుల భర్తీ జరుగుతోందని, ఇప్పటికే అన్ని రకాల వైద్యులు ఉన్నారని తెలిపారు. వైద్యసిబ్బంది బాధ్యతగా పనిచేసి కనిగిరి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆస్పత్రిలో మత్తు వైద్యులు, గైనకాలజిస్టులు ఇద్దరు ఉన్నందున త్వరలో సర్జరీలు ప్రారంభించాలన్నారు. వైద్య సేవలకు, ఆపరేషన్ థియేటర్‌లోకి కావాల్సిన అన్ని రకాల పరికరాలను పూర్తిస్థాయిలో అందించేందుకు తక్షణమే నిధుల వినియోగానికి ఎమ్మెల్యే బుర్రా ఆమోదం తెలిపారు. ప్రైవేటు వైద్యశాలల్లో పేదోడు దోపిడీకి గురికాకూడదంటే.. ప్రభుత్వ వైద్యశాలలోని సిబ్బంది ఉత్తమ సేవలు అందించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. వైద్యులు దేవుళ్లతో సమానమని, సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే కోరారు.

త్వరలో జిల్లా వైద్యశాలగా మార్పు...

కనిగిరి ప్రభుత్వ వైద్యశాల త్వరలో నూరు పడకల వైద్యశాలగా మార్పు చెందనున్నట్లు ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్ తెలిపారు. తాను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైద్య శాఖామంత్రికి పలుమార్లు విన్నవించడంతో స్పందించిన ప్రభుత్వం.. 100 పడకల ఆస్పత్రికి కావాల్సిన సమగ్ర నివేదిక ఇవ్వాలని కోరిందన్నారు. నూరు పడకల వైద్యశాలగా మారితే వైద్యుల సంఖ్య పెరిగి మరింత మెరుగ్గా సేవలు అందుతాయని తెలిపారు. మార్కాపురంలో మెడికల్ కాలేజీ ప్రారంభం కాగానే కనిగిరి ప్రభుత్వ వైద్యశాల జిల్లా వైద్యశాలగా మార్పు చెందుతుందన్నారు. ఆ మేరకు పూర్తిస్థాయి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అధికారులు పంపినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. సమావేశంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ సయ్యద్ అబ్దుల్ కలాం, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, ఏపీ మెడికల్ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, వైద్యశాల కమిటీ సభ్యుడు పులి వెంకటలక్ష్మి, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, సొసైటీ చైర్మన్ సంగు సుబ్బారెడ్డి, సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, కౌన్సిలర్లు శ్రీరామ సతీష్, వేల్పుల వెంకటేశ్వర్లు, దాసరి మురళి, పిల్లి లక్ష్మీనారాయణరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలి

- నులి పురుగుల నివారణ మాత్రలు మింగించాలి
- 19 ఏళ్ల వయసు వరకు ఆల్బెండజోల్ మాత్రలు వాడాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్



విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్ర వేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: పిల్లల ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని, వారిలో నులి పురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ సూచించారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఒంగోలు భాగ్యనగర్‌లోని కేంద్రీయ విద్యాలయంలో జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు 19 ఏళ్ల వరకు ఆల్బెండజోల్ మాత్రలు తీసుకోవచ్చన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారులు ప్రతి పాఠశాలలో పిల్లలతో మాత్రలు మింగించాలన్నారు. ఆహారం తీసుకునే ముందుగా చేతులు శుభ్రం చేసుకోవాలని సూచించారు. లేకుంటే కడుపులో నులిపురుగులు చేరతాయని, తద్వారా రక్తహీనత, నీరసం, కడుపు మందగించడం వంటివి ఏర్పడతాయని తెలిపారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ రాజ్యలక్ష్మి, ఉప వైద్యాధికారి మాధవీలత, నోడల్ అధికారి భగీరధి, డీఐఓ పద్మజ, డీపీఎంఓ వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు వెబ్ ఆప్షన్లు

కొత్తపట్నం: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలు రాసిన విద్యార్థులు ఆగస్టు 11 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్‌లు పెట్టుకోవచ్చని ఈతముక్కలలోని ఉలిచి వెంకారెడ్డి, సీతారావమ్మ ప్రభుత్వ బాలికల పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ వి.యేసుప్రసాద్‌రావు తెలిపారు. కాలేజీలో మూడు బ్రాంచ్‌లున్నాయన్నారు. ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్, కంప్యూటర్ ఇంజినీరింగ్, నాన్ ఇంజినీరింగ్, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ డిప్లొమా వంటి కోర్సులున్నాయన్నారు. విద్యార్థినులకు ఆయా బ్రాంచీల్లో విద్య నేర్పేందుకు సుశిక్షితులైన అధ్యాపకులున్నారని తెలిపారు. విశ్రాంత వాతావరణం, అధునాతన లేబొరేటరీలు, హాస్టల్ వసతి సౌకర్యం ఉందన్నారు. మూడు బ్రాంచీల్లో విద్యార్థినులకు చదువు పూర్తి కాక ముందే ప్రాంగణ ఎంపికల్లో మంచి ఉద్యోగాలు వచ్చాయన్నారు. పాలిటెక్నిక్ విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాలికా విద్యకు ప్రభుత్వం పెద్ద పీట

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి



కేజీబీవీలో భోజనాన్ని తనిఖీ చేస్తున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి

పుల్లలచెరువు: రాష్ట్రంలో బాలికా విద్యకు రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. మండలంలోని చాపలమడుగులో అంగన్‌వాడీ కేంద్రాన్ని, పీవీ పల్లిలో జెడ్పీ పాఠశాలను, పుల్లలచెరువులో కేజీబీవీ, వైద్యశాల, సచివాలయాన్ని గురువారం తనిఖీ చేశారు. పుల్లలచెరువు మండలం నుంచి పలు ఫిర్యాదులు అందాయని ఆమె తెలిపారు. పిల్లలు విద్య అభ్యసించడం లేదని, డ్రాపవుట్స్ ఎక్కువగా ఉన్నారని, బాల్య వివాహాలు బాగా జరుగుతున్నాయని కమిషన్ దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఆకస్మికంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. తనిఖీల అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పద్మావతి మాట్లాడుతూ పలు పాఠశాలల్లో తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. పిల్లల సమస్యలు పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్ద పీట వేస్తోందని, నేటి బాలలే రేపటి పౌరులని, ప్రపంచ నిర్మాతలని, ప్రపంచ సంపద కూడా విద్యార్థులేనని పేర్కొన్నారు. విద్యార్థుల అభివృద్ధి, చదువులో ఏపీ రోల్ మోడల్‌గా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. 8వ తరగతి నుంచే ట్యాబ్‌లు అందజేసి బైజ్యూస్ ఇన్‌స్టాల్ చేయడంతో పాటు నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 26 జిల్లాల కలెక్టర్లను మానిటరింగ్ చేయమని ఆదేశాలివ్వడం జరిగిందన్నారు. తమ శాఖ ద్వారా రాష్ట్రంలోని 18 శాఖలతో సమీక్షిస్తూ పిల్లలందరి రక్షణ, సంరక్షణకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో వెనుకబడిన ప్రాంతాల్లో ఎక్కువగా బాల్యవివాహాలు జరుగుతున్నాయని తమ దృష్టికి వచ్చిందన్నారు. అధికారులు ఎంత దృష్టి పెట్టినా కూడా అవి ఆగడం లేదని, తల్లిదండ్రులు కూడా బాల్యవివాహాలు జరగకుండా దృష్టి పెట్టాల్సిన బాధ్యత ఉందని అన్నారు. పిల్లల భవిష్యత్ బాగుండాలనే ఉద్దేశంతో తమ శాఖ ద్వారా తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇలాంటివి జరగకుండా ప్రతి విద్యార్థి పాఠశాలకు వెళ్లాలనే లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్ది నాణ్యమైన విద్య అందిస్తున్నట్లు పద్మావతి వివరించారు. ప్రస్తుతం గ్రామస్థాయిలో ఉన్న సమస్యలను గుర్తించి ప్రభుత్వానికి తెలియజేయడం జరుగుతుందన్నారు. పిల్లలకు క్షేత్రస్థాయిలో ప్రభుత్వం కల్పించిన వసతులను అందించేందుకు తమ కమిషన్ కృషి చేస్తోందని తెలిపారు.

సమస్యలు పరిష్కరించిన కమిషన్ సభ్యులు...

మండల కేంద్రంలోని కేజీబీవీ ఆవరణలో దుర్వాసన వస్తుండటంతో నెల రోజులుగా ఇబ్బంది పడుతున్నామని తెలపడంతో వెంటనే పంచాయతీ కార్యదర్శి బాలునాయక్‌ను పిలిపించి రేపటిలోగా పాఠశాలలో పారిశుధ్యం మెరుగుపరిచి విద్యార్థులకు అసౌకర్యం లేకుండా చూడాలని కమిషన్ సభ్యులు ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో నులిపురుగుల నివారణ మాత్రలు మింగించారు. కార్యక్రమంలో జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యురాలు నీలిమ వంశీలత, ఎంఈవోలు శామ్యూల్‌జాన్, ఇందిర ప్రసాద్, సీడీపీవో పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి...

ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుంటూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు పద్మావతి సూచించారు. పుల్లలచెరువు మండలంలోని మురికమళ్ల బాలికా ఆశ్రమ పాఠశాలలో గురువారం పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గిరిజనులతో ముచ్చటించారు. బాలికలు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులపై ఆరా తీశారు. గిరిజనులతో మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడగ్గా.. అందుతున్నాయని సమాధానం చెప్పారు. ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు. ఆమె వెంట జిల్లా కమిషన్ సభ్యురాలు నీలిమవంశీలత, తహసీల్దార్ దాసు, ఎంపీడీవో మరియదాసు, ఎంఈవోలు శామ్యూల్‌జాన్, ఇందిరప్రసాద్, సీడీపీవో పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

ఒంగోలు: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు చేపట్టాలని బీసీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఆదేశించారు. గురువారం స్థానిక బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో జిల్లాలోని బీసీ సంక్షేమశాఖ అధికారులతో సమీక్షించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి ఇప్పటివరకు 90 శాతం ఈకేవైసీ పూర్తయినట్లు తెలిపారు. ఇంకా పూర్తికాని ఈకేవైసీ అప్‌డేషన్‌ను మూడు రోజుల్లో పూర్తి చేయాలని సూచించారు.

క్లుప్తంగా

ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణ దరఖాస్తు గడువు 25 వరకు పొడిగింపు

ఒంగోలు: దివ్యాంగులకు మంజూరు చేసే ఎన్‌హెచ్‌ఎఫ్‌డీసీ రుణ దరఖాస్తుల స్వీకరణ ఈనెల 25వ తేదీ వరకు పొడిగించినట్లు విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సహాయ సంస్థ జిల్లా మేనేజర్ జి.అర్చన గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అవసరం ఉన్న దివ్యాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారం , ఇతర వివరాలను డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ప్రకాశం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని, సంబంధిత ధ్రువీకరణ పత్రాలు జత చేసి సహాయ సంచాలకులు/జిల్లా మేనేజర్, ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ, ఒంగోలు, ప్రకాశం జిల్లా కార్యాలయానికి ఈనెల 25వ తేదీలోగా పంపాలని సూచించారు. దరఖాస్తుఫారం, సదరం సర్టిఫికెట్(18 నుంచి 60 ఏళ్ల వరకు), ఆధార్ కార్డు, యూడీఐడీ కార్డు, ఉద్యోగి హామీ పత్రం, డ్రాయింగ్ అధికారి అంగీకార పత్రం(5 నుంచి 10 ఏళ్ల సర్వీసు మిగిలి ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే) లేదా బ్యాంకు గ్యారెంటీ/జాయింట్ కలెక్టర్ జిల్లా మేనేజర్ పేరున తనఖా చేసిన ఆస్తి ధ్రువపత్రాలు, రూ.100 నాన్ జుడీషియల్ బాండ్, విద్యార్హతలు/శిక్షణ సర్టిఫికెట్, బ్యాంకు అకౌంట్ పాస్‌బుక్, వైకల్యం తెలియజేసే మూడు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, డీఐసీ లేదా కన్సర్డ్ లైన్‌డిపార్టుమెంట్లు ఆమోదించిన ప్రాజెక్టు రిపోర్టు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నుంచి నో అబ్జెక్షన్ ధ్రువపత్రం సమర్పించాలని వివరించారు. సందేహాలుంటే 08592 281310ను సంప్రదించాలని సూచించారు.

అన్ని పాఠశాలల్లో 'మేరీ మాటీ-మేరా దేశ్'

● డీఈఓ సుబ్బారావు

ఒంగోలు: మేరీ మాటీ-మేరా దేశ్(నా మట్టి- నా దేశం) క్యాంపెయిన్‌ను ప్రతి పాఠశాలలో నిర్వహించాలని హెడ్మాస్టర్లను జిల్లా విద్యాశాఖ అధికారి వీఎస్ సుబ్బారావు ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం రాష్ట్ర సమగ్రశిక్ష కార్యాలయం ఆధ్వర్యంలో ఈ క్యాంపెయిన్‌కు సంబంధించి వివిధ కృత్యాల నిర్వహణకు ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. గ్రామాల్లో ఈనెల 15వ తేదీ వరకు మేరీ మత్తీ-మేరీ దేశ్ ప్రతిజ్ఞ నిర్వహించి, సంబంధిత ఫొటోలు సెల్ఫీల రూపంలో అందజేయాలన్నారు. 20వ తేదీ వరకు జిల్లాలోని అన్ని మండల కేంద్రాలు/మున్సిపాలిటీల్లో /కార్పొరేషన్లలో మేరీ మత్తీ-మేరీ దేశ్ కార్యక్రమాలు నిర్వహించాలని, ఈనెల 30న కర్తవ్య పథ్ కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. జిల్లాలోని ఉప విద్యాశాఖ అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు వారి పరిధిలో కార్యక్రమాలు నిర్వహించేలా చూడాలని చెప్పారు.

29న ఏఎన్‌యూ స్నాతకోత్సవం

ఒంగోలు: ఈనెల 29న ఆచార్య నాగార్జున యూనివర్శిటీ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆచార్య నాగార్జున యూనివర్శిటీ వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ పేర్కొన్నారు. ఇందుకు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ అనుమతి ఇచ్చినట్లు తెలిపారు. స్నాతకోత్సవానికి నాక్ డైరెక్టర్ ఆచార్య గణేశన్ కన్నాబిరామ్ ముఖ్యఅతిథిగా పాల్గొని స్నాతకోపన్యాసం చేస్తారన్నారు. పాలగుమ్మి సాయినాథ్‌కు విశ్వవిద్యాలయ గౌరవ డాక్టరేట్ ఇవ్వడానికి నిర్ణయించినట్లు తెలిపారు.

అవినీతికి పాల్పడితే సహించేది లేదు

- బాధితుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించండి
- స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా చూడాలి
- గత ఏడాదికంటే 13 శాతం తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- నేర సమీక్షలో ఎస్పీ మలికా గర్గ్


మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్


నేర సమీక్షలో పాల్గొన్న పోలీసు అధికారులు

ఒంగోలు టౌన్: మరికొద్దిరోజుల్లో నిర్వహించనున్న గ్రామ సర్పంచ్, వార్డు మెంబర్ల ఉప ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ మలికా గర్గ్ ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. పోలీసు అధికారులు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదులపై సత్వరమే స్పందిస్తూ న్యాయం చేకూరుస్తామనే నమ్మకాన్ని బాధితులకు కలిగించాలని చెప్పారు.

విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలని, ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. జాతీయ రహదారుల గుండా అక్రమంగా తరలిస్తున్న గంజాయి ప్రత్యేక దృష్టి సారించాలని, గంజాయి కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చూడాలని, ముద్దాయిల వివరాలను ఇతరా జిల్లాల పోలీసులు నిఘా ఉంచడానికి సమాచార మార్పిడి చేయాలని సూచించారు. దొంగతనాలు, దోపిడీలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని, హైవేలపై పెట్రోలింగ్‌ను ముమ్మరం చేయాలని చెప్పారు. రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రోజూ క్రమం తప్పకుండా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించాలని, మైనర్లు వాహనాలు నడపకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ట్రిపుల్ డ్రైవింగ్, అతివేగంగా వాహనాలు నడిపే వారిని కట్టడి చేయాలని చెప్పారు. గత సంవత్సరంతో పోలిస్తే 13 శాతం మేర రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, మరిన్ని చర్యల ద్వారా రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు.

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పెండింగ్ కేసుల విషయంలో నిత్యం పర్యవేక్షణ ఉంటుందని స్పష్టం చేసిన ఎస్పీ యాక్షన్, ఎస్‌ఓపీ ద్వారా పెండింగ్ కేసులను తగ్గించుకోవాలని సూచించారు. కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని, గుడ్ ట్రయల్ మానిటరింగ్ ద్వారా నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి అంకితా సురాన, ఏఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, డీఎస్పీ డీఎస్పీ మరియదాసు, డీఎస్పీలు వి.నారాయణస్వామిరెడ్డి, అశోక్ వర్ధన్, వీర రాఘవరెడ్డి, వి.శ్రీనివాసులు, సీహెచ్ శ్రీనివాసరావు, డీసీఆర్పీ సీఐ ధర్మేందర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన లారీ

● ఒకరు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు


రోడ్డు మార్జిన్‌లోకి దూసుకెళ్లిన లారీ, చిత్రంలో దెబ్బతిన్న కారు

చీమకుర్తి: ఎదురెదురుగా వస్తున్న లారీ, కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం సాయంత్రం చీమకుర్తి-సంతనూతలపాడు మధ్య కర్నూల్ రోడ్డుపై చోటుచేసుకుంది. కారులో ప్రయాణిస్తున్న దర్శికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు(55) అక్కడికక్కడే మృతి చెందారు. ఒంగోలులో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీటింగ్‌కు హాజరై తిరుగు ప్రయాణంలో ఉండగా చీమకుర్తి నుంచి ఒంగోలు వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. క్షతగాత్రులను ఒంగోలు జీజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై రమేష్‌రెడ్డి పరిశీలించారు.

అక్రమ మద్యం స్వాధీనం

పామూరు: మండల కేంద్రమైన పామూరులో అక్రమంగా మద్యం కలిగి ఉన్న ఇద్దరిని అరెస్టు చేసి, 108 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఈబీ సీఐ షేక్ అబ్దుల్‌జలీల్ తెలిపారు. గురువారం అక్రమంగా మద్యం విక్రయించేందుకు యత్నిస్తున్న పామూరుకు చెందిన సయ్యద్ గఫూర్, అతనికి సహకరిస్తున్న సేల్స్‌మాన్ నల్లబోతుల మహేష్‌ను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువ డాక్టర్ మృతి


మృతురాలు డాక్టర్ అన్నం అగస్త్య


నుజ్జునుజ్జు అయిన కారు

బేస్తవారిపేట: లారీని ఓవర్‌టేక్ చేయబోయిన కారును ఎదురుగా వస్తున్న మరో కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో ఓ యువ వైద్యురాలు ప్రాణాలు కోల్పోయింది. ఇదే ఘటనలో ఒకరికి తీవ్రంగా, మరో ఆరుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ ప్రమాదం ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు బస్టాండ్ సమీపంలో ఒంగోలు-నంద్యాల హైవేపై గురువారం రాత్రి చోటుచేసుకుంది. రెండు కార్లు నుజ్జునుజ్జు కావడంతో సంఘటనా స్థలం భీతావహంగా మారింది. అందిన సమాచారం మేరకు.. బేస్తవారిపేటకు చెందిన సిద్ధార్థ విద్యాసంస్థల అధినేత, దివంగత అన్నం చంద్రశేఖరరెడ్డి, కృష్ణవేణి దంపతుల కుమార్తె డాక్టర్ అన్నం అగస్త్య గిద్దలూరులోని అరుణోదయ వైద్యశాలలో ఏడు నెలలుగా సొంతగా ప్రాక్టీస్ చేస్తున్నారు. రోజూలాగే ఆస్పత్రి నుంచి కారులో బయలుదేరి బేస్తవారిపేటకు వస్తున్నారు. ఈ క్రమంలో ముందు వెళ్తున్న లారీని పూసలపాడు బస్టాండ్ వద్ద ఓవర్ టేక్ చేయబోతుండగా కొమరోలు వైపు ప్రయాణిస్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. దీంతో డాక్టర్ అగస్త్య కారు లారీని ఓ వైపు ఢీకొట్టి రోడ్డు మార్జిన్‌లో ఆగిందని భావిస్తున్నారు. ప్రమాద తీవ్రత వల్ల రెండు కార్లు పూర్తిగా ధ్వంసమయ్యాయా మరో వాహనం కూడా ఢీకొట్టి వెళ్లిపోయిందా అనేది పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. మృతురాలికి భర్త విశ్వనాథరెడ్డి, కుమార్తె ఉన్నారు.

ఆస్తి కోసం అమానుషం!

- మద్యం సీసాతో తల్లిపై దాడి చేసిన కొడుకు
- తల్లికి తీవ్రగాయాలు.. ఒంగోలు తరలింపు

కనిగిరి రూరల్: ఆస్తి రాసివ్వలేదనే అక్కసుతో కన్నతల్లిపైనే దాడికి తెగబడ్డాడు ఓ ప్రబుద్ధుడు. మద్యం సీసా పగలగొట్టి ఉదరం, చేతిపై పొడవడంతో ఆమెకు తీవ్ర గాయాయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి కనిగిరి పట్టణంలోని సూరా పాపిరెడ్డి కాలనీలో చోటుచేసుకుంది. వివరాలు.. సూరా పాపిరెడ్డి కాలనీలో బోనం లక్ష్మమ్మ, తిరుమలయ్య దంపతులు నివాసం ఉంటున్నారు. అయితే వారి చిన్న కుమారుడు బోనం బాలకాశయ్య వారు నివసిస్తున్న ఇంటిని తన పేరుపై రాసివ్వమని అడగ్గా అందుకు తల్లి నిరాకరించింది. దీంతో ఇరువురు గొడవ పడ్డారు. మాటామాటా పెరగడంతో ఇంట్లో ఉన్న ఖాళీ మద్యం సీసా పగలగొట్టి తల్లి పొట్ట, చేతిపై పొడిచాడు. గొంతు నులుముతుండగా ఆమె గట్టిగా కేకలు వేయడంతో చుట్టు పక్కల వారు వచ్చి తప్పించారు. లక్ష్మమ్మను ఆటోలో స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి ఒంగోలులోని మరో హాస్పిటల్‌కు సిఫార్సు చేశారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామిని దర్శించుకున్న కేతిరెడ్డి


ఆశీర్వచనం అందుకుంటున్న కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి

అద్దంకి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామిని సినీ నిర్మాత, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి గురువారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనానంతరం పూలమాల వేసి శాలువాతో సత్కరించి ఆశీర్వచనం , తీర్థప్రసాదాలు అందజేశారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు దుర్మరణం


మృతి చెందిన శ్రీను

చీమకుర్తి: కర్ర ట్రాక్టర్ ఢీకొనడంతో మోటర్ సైకిల్‌పై వెళ్తున్న ఓ యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. ఈ సంఘటన మర్రిచెట్లపాలెం వద్ద కర్నూలు రోడ్డుపై గురువారం చోటుచేసుకుంది. మృతుడిని మర్రిచెట్లపాలెం గ్రామానికి చెందిన శ్రీను(25)గా పోలీసులు గుర్తించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

గుర్తు తెలియని యువతి అనుమానాస్పద మృతి


నీటి మడుగులో తేలియాడుతున్న యువతి మృతదేహం

చీమకుర్తి: మండలంలోని కూనంనేనివారిపాలెం-ఏలూరివారిపాలెం మధ్య రోడ్డు పక్కన ఉన్న చిన్న నీటి కుంటలో గుర్తు తెలియని యువతి అనుమానాస్పద స్థితితో మృతి చెందింది. ఈ సంఘటన గురువారం రాత్రి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. మృతురాలి వయసు 20 ఏళ్లలోపు ఉండొచ్చని అంచనా. యువతి శరీరంపై పంజాబీ డ్రెస్ ఉంది. దుర్వాసన వస్తుండటంతో రోడ్డుపై రాకపోకలు సాగించే వారు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. యువతి మృతి చెంది వారం నుంచి పది రోజులై ఉంటుందని భావిస్తున్నారు. మృతదేహం కింద ఒక పెద్ద బండ ఉండటం, తలపై వెంట్రుకలు కట్ చేసినట్లుగా ఉండటంతో ఎవరైనా హత్య చేసి నీటిమడుగులో పడేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నీటి మడుగు చుట్టూ కొంతమేర జమ్ము పెరగడంతో రోడ్డు పక్కనే అయినప్పటికీ ఇన్నాళ్లు ఎవరూ మృతదేహాన్ని గుర్తించలేకపోయినట్లు తెలుస్తోంది. సంఘటనా స్థలాన్ని ఎస్సై రామిరెడ్డి పరిశీలించారు.

వేటకు వెళ్లి గల్లంతైన మత్స్యకారుడు

● కొన్ని గంటల తర్వాత ఆచూకీ లభ్యం


వాగులో పోలయ్య ఆచూకీ గాలిస్తున్న గ్రామస్తులు

టంగుటూరు: వేటకు వెళ్లిన మత్స్యకారుడు బుధవారం సాయంత్రం అదృశ్యం కాగా కొన్ని గంటలపాటు గాలించిన తర్వాత గురువారం ఆచూకీ లభ్యమైంది. ఈ సంఘటన టంగుటూరు మండలం అనంతవరం పంచాయతీ పరిధిలోని తాళ్లపాలెం సమీపంలో పాలేరు వాగులో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన పోలయ్య అనే వ్యక్తి బుధవారం సాయంత్రం పాలేరు వాగులో చేపల వేటకు వెళ్లాడు. గురువారం ఉదయం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. పోలయ్య భార్య, కుమారుడు వెంకట్రావు గ్రామస్తుల సహకారంతో పాలేరు వాగులో గాలిస్తుండగా వేటకు ఉపయోగించే వల కనిపించింది. పడవ మాత్రం ఆచూకీ లేదు. దీంతో మరో పడవలో వెళ్లి గాలించగా వాగు ఒడ్డున నీరసంతో పడిఉన్నాడు హుటాహుటిన పోలయ్యను ఇంటికి తరలించి ప్రథమ చికిత్స చేశారు.

సెల్‌ఫోన్ దుకాణంలో చోరీ


సెల్ ఫోన్ దుకాణం తలుపులు పగలగొట్టిన దుండగులు

కొమరోలు: కొమరోలులోని ఓ సెల్‌ఫోన్ దుకాణంలో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. కొమరోలులోని మెయిన్ రోడ్డులోని తిరుపతి సెల్ పాయింట్‌లో తలుపులు పగలగొట్టి కౌంటర్‌లో ఉంచిన రూ.15 వేల నగదు, ఒక కొత్త సెల్‌ఫోన్‌ను అపహరించారు. గురువారం ఉదయం యజమాని తిరుపతి దుకాణం వద్దకు రాగా తలుపులు పగలగొట్టి ఉండడంతో చోరీ జరిగినట్లు గుర్తించి స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు.. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఒంగోలులో సతీమణి పద్మావతి, తనయుడు సుధీర్, పార్టీ నేతలతో కలిసి శిద్దా కేక్ కట్ చేశారు. - సాక్షి, ఒంగోలు

విద్యుదాఘాతంతో షిఫ్ట్ ఆపరేటర్ మృతి


మరణించిన దయాసాగర్


మృతుడు వెంకటేష్(ఫైల్)

దర్శి: మండలంలోని రాజంపల్లి గ్రామంలో విద్యుత్ సబ్‌స్టేషన్‌లో షిఫ్ట్ ఆపరేటర్ చొప్పరపు వెంకటేష్ ఉరఫ్ వెంకీ(23) గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు విద్యుత్ లైన్ లాగుతున్న క్రమంలో వెంకటేష్ స్తంభం ఎక్కి కిందకు దిగుతున్నాడు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు వీధి లైట్ల వైరు తగలడంతో ఒక్కసారిగా కిందపడిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లేసరికి వెంకటేష్ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. దర్శికి చెందిన శ్రీనివాసరావు, పద్మ దంపతులకు వెంకటేష్ ఒక్కడే సంతానం. చేతికందొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు బోరున విలపించారు. ఘటనా స్థలాన్ని ఎస్సై రామకృష్ణ పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో గ్రానైట్ కార్మికుడి మృతి

మార్టూరు: విద్యుదాఘాతంతో గ్రానైట్ కార్మికుడు మృతి చెందిన ఘటన మండల కేంద్రం మార్టూరులో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం ఫత్తేపూర్ జిల్లా హమౌలీ గ్రామానికి చెందిన దయాసాగర్(25) స్థానిక రాజుపాలెం డొంకలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శ్లాబులు కటింగ్ చేసే మిషన్‌ను ఆన్ చేసే క్రమంలో విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయాడు. స్థానికులు దయాసాగర్‌ను చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించటంతో మార్టూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకువచ్చారు. మృతుడు దయాసాగర్, భార్య సదాప్యారీలకు రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. ప్రస్తుతం దయాసాగర్ భార్య గర్భిణిగా ఉన్నట్లు తోటి కార్మికులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కూలింగ్ కెనాల్‌లో జారి పడి వ్యక్తి మృతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): భవానీపురం సమీపంలో ఉన్న కూలింగ్ కెనాల్‌లో జారి పడి ఒక వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం జరిగింది. ప్రకాశం జిల్లా గిద్దలూరు మండలం సంజీవరావు కాలనీకి చెందిన చాగంటి చిన్నకోటిరెడ్డి భవానీపురంలో సిమెంట్ ముఠాలో పని చేస్తున్నాడు. నెలకొకసారి వారి ఊరుకెళ్లి వస్తుంటాడు. గురువారం వెంకటేశ్వర పౌండ్రి సమీపంలో ఉన్న సిమెంట్ గోడౌన్ వద్దకు వెళ్లిన చిన్నకోటిరెడ్డి బహిర్భూమి నిమిత్తం కూలింగ్ కెనాల్‌కు వెళ్లి పొరపాటున కాలువలోకి జారి పడిపోయాడు. కెనాల్‌లో పడిపోయిన చిన్నకోటిరెడ్డిని అటుగా వెళ్తున్న మరో ముఠా కార్మికుడు చూసి అతని అన్న పెద్దకోటిరెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం అందించాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.